# బూమ్‌రాంగ్

'ఆడపిల్ల పుట్టిందండీ' అని నర్స్ చెబితే ఆడపిల్లా' అంటూ దిగులుగా తలపట్టుకున్న రోజులు పోయాయి. ఇప్పుడేమో పది ఇళ్ళు ఉంటే ఒక్క ఇంట్లోనే అమ్మాయి ఉంటోంది. నాకు మొదటి కాన్పులో అబ్బాయి పుట్టినప్పుడు, 'మనం ఇంకో సంతానం కోసం ప్రయత్నించవద్దు, అమ్మాయి పుట్టిందనుకోండి, లేనిపోని బాధ' అని చెప్పాను మావారితో. కానీ ఆయన ఒప్పుకోలేదు. అమ్మాయో అబ్బాయో - పిల్లలు మాత్రం ఇద్దరుండాల్సిందేనన్నారు. రెండోసారి కూడా నాకు అబ్బాయే పుట్టాడు. మావారు కాస్త దిగులుపడ్డారుకానీ నేను మాత్రం ఆనందంతో పొంగిపోయాను.

కానీ, మా అబ్బాయిలిద్దరూ పెద్దాళ్ళయి, ఉద్యోగాలు వచ్చి, పెళ్ళిచేసే సమయానికి మావారి దిగులుకాస్తా నాకు బదిలీ అయింది. మామూలు బాధ కాదండీ బాబూ, వేలం కేంద్రాలచుట్టూ తిరగలేక చస్తున్నామనుకోండి. పెళ్ళికూతురి కోసం కట్టిన ఏభైశాతం డిపాజిట్లలో, మేముపోగొట్టుకున్న డబ్బు ఇంతవరకూ లక్షల్లో తేలింది. వెనకటికి బ్రహ్మంగారు కాలజ్ఞానంలో ముందుముందు చాలా వింతలు జరుగుతాయంటూ ఎన్నో వింతల గురించి రాశారుగానీ ఈ వింత గురించి కూడా రాసి ఉంటే ముందే జాగ్రత్తపడి ఉండేదాన్ని.

నా మనసంతా చాలా చిరాకుగా ఉంది. నా పెళ్ళికి మా నాన్న పడిన బాధలు గుర్తుకువచ్చి, నేను ఇప్పుడు పుట్టి ఉంటే ఎంత బావుండేది అనుకుంటున్నాను.

ఇంతలో... "ఏమేవ్, ఇవాళ మనం ఆక్షన్ హాల్‌కి వెళ్ళాలి. మర్చిపోయావా నీ సుపుత్రుడు ఏడీ?" అంటూ వచ్చారు మావారు. "ఓహో, ఇదో తద్దినం ఉంది కదూ". "అవును, ఇప్పుడు తద్దినం అనుకుంటున్నావు. మరో ప్రయత్నంచేద్దాం, అమ్మాయి కోసం అంటే వినకపోతివి. మూడో కాన్పులో అమ్మాయే పుట్టి ఉండేది" అన్నారు ఆయన నన్ను కోపంగా చూస్తూ. "మీ కోరిక నెరవేరుతుంది. పోనీ ఇప్పుడు ప్రయత్నంచేద్దామా". అన్నాను కొంటెగా ఆయన్ను చూస్తూ. ఫక్కున నవ్వారాయన. "చాల్లేగానీ, మంచి పట్టుచీర కట్టుకో. నేను సూట్ వేసుకుంటాను. వాడిని కూడా సూట్ వేసుకోమను" అని చెబుతూ ఆయన బెడ్‌రూమ్‌లోకి వెళ్ళారు. ఆక్షన్ హాల్లో అడుగు పెట్టాలంటే మగాళ్ళు విధిగా సూట్ వేసుకోవాలి. ఆడవాళ్ళు పట్టుచీర కట్టుకోవాలి. మా పెద్దబ్బాయి, మావారు, నేనూ తయారై ఆక్షన్ హాల్‌కి బయలుదేరాం.

అది ఏసీ హాలు. మిస్ ఇండియా పోటీలు నిర్వహించే కేంద్రంలా ఉంది. మేము ముందుగా ఆక్షన్ హాల్లోకి వెళ్ళడానికి ఎంట్రీఫీజు తలా వెయ్యి రూపాయలు కట్టేసి, లోపలకు వెళ్తున్నాం. మమ్మల్ని ఒక వ్యక్తి ఆపుచేసి – "అమ్మా, ఇలా వెళ్ళండి. అక్కడ ఆక్షన్‌లో ఉన్న అమ్మాయిలు ఉన్నారు. పక్కనే వివరాలూ రాసి ఉన్నాయి. అవి చూసుకుని, మీరు ఏఏ అమ్మాయిలను మీ అబ్బాయికి వేలంపాటలో కొనుక్కోడానికి ఎన్నుకున్నారో తేల్చుకుని, వాళ్ళకు సంబంధించిన డిపాజిట్ కట్టేసి హాల్లోకి వెళ్ళండి. అన్నింటికన్నా ముఖ్యం సూపర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో మీ అబ్బాయికి చేయించిన టోటల్ బాడీ టెస్ట్ రిపోర్టులు వారికి ఇవ్వండి. అవి వైద్య నిపుణులు వెరిఫై చేసి ఓకే అంటేనే మీకు గ్రీన్‌కార్డ్ ఇస్తారు. అప్పుడే మీరు లోపలికి వెళ్ళవచ్చును. పన్నెండు గంటలకు ఆక్షన్ మొదలవుతుంది" అన్నాడు. ఈ సూపర్ మల్టీ స్పెషాలిటీలో పరీక్షలు మూడు నెలలకోసారి మళ్ళీమళ్ళీ చేయించాలి. పైగా ఆక్షన్ హాలువాళ్ళ అప్రూవల్ పొందిన హాస్పిటల్‌లోనే చేయించాలి. ఏ రోగం లేకపోయినా సరే. ఇది తప్పడంలేదు. దీనికీ ఎన్నో వేలు అయింది ఇప్పటికి.

మా అబ్బాయి జగన్ "ఏమిటమ్మా ఇదంతా డర్టీగా. అసలు నేను పెళ్ళి చేసుకోకపోతే ఏమయిపోతుంది? నాకు మాత్రం అమ్మాయిలు పుడతారని గ్యారంటీ ఏమిటి? తర్వాత మా అబ్బాయి కోసం నేను ఎన్ని పాట్లుపడాలో ఏమో?" అంటున్నాడు నుదురు కొట్టుకుంటూ. అందుకు మావారు "నిజమేరా. కానీ, మేము ముసలాళ్ళమైపోతాం కదా. నీ బాగోగులు చూసుకోవడానికి ఒక అమ్మాయి ఉండాలిగా" అన్నారు మెల్లగా.

"డామ్ డర్టీ. ఒక సర్వెంట్ మెయిడ్‌ని పెట్టుకుంటాను".

"లేదులే కన్నా, ఇవాళ వేలంపాటలో మనకు కావాల్సిన అర్హతలు ఉన్న అమ్మాయిలు ఉంటారులే నిరాశపడకు" అన్నాను. "మొన్నటివారం ఏమయింది... మనకు అన్నివిధాలా నచ్చిన అమ్మాయిని ఎవడో మనం పాడినపాటకన్నా రెట్టింపు పెట్టి కొనుక్కుపోయాడు. మనకు డిపాజిట్‌లో లక్ష రూపాయలు పోయాయి కదా" అన్నాడు జగన్ విసుగ్గా. "ఇవ్వాళ అలా జరగదు కన్నా. మనం ఎప్పుడూ మంచి జరుగుతుందనే ఆలోచించాలి. నువ్వేకదా థింక్ పాజిటివ్ అంటుంటావు" అన్నాను.

చిన్న పొడవాటి హాల్లో స్టడీ ఛెయిర్ ఉండే కుర్చీల్లో చక్కగా చీరలు కట్టుకుని కొంతమంది, పంజాబీ సూట్లలో కొందరు, లంగా వోణీల్లో మరికొంతమంది అమ్మాయిలు చక్కగా తయారై కూర్చుని ఉన్నారు. వాళ్ళపక్కనే పెద్ద బోర్డుమీద వాళ్ళ వివరాలతోపాటు సుమారుగా వారి విలువ రాసి ఉంది.

ముందు మా అబ్బాయిని ఒక రౌండ్‌వేసి తనకు నచ్చిన అమ్మాయిల నంబర్లూ వారి విలువా రాసుకురమ్మన్నాను. ఎందుకంటే, అమ్మాయి విలువలో పదిశాతం డబ్బు

డిపాజిట్ కట్టాలి. ఒకవేళ ఆ అమ్మాయిని వేలంపాటలో గెలవలేకపోతే, మనం కట్టిన డిపాజిట్‌లో ఏభైశాతం తగ్గించుకుని నిర్వాహకులు పదిశాతం ఉంచుకుని, మిగతా నలభై శాతం అమ్మాయికి ఇచ్చేస్తారు. ఏమిటీ, మరీ ఇంత దారుణంగా మా డిపాజిట్ కట్ చేసేస్తున్నారని నిర్వాహకులను అడిగాను మొదటిసారి వచ్చినపుడు. "ప్రతీవాడూ వచ్చి వేలంపాటలో పాల్గొనడం, వెళ్ళిపోవడం. ఇదో కాలక్షేపం అయిపోయిందండీ. మొదట్లో మా ఖర్చుల వరకే చాలా చిన్న మొత్తం తీసుకునేవాళ్ళం. కానీ అమ్మాయిలకూ ఇవ్వాలనేసరికి తప్పడం లేదు" అన్నారాయన. ఆ మాటా నిజమే. ప్రతీదీ వేలంవెర్రి అయిపోయింది.

ఈలోగా మా అబ్బాయి సంతోషంగా వచ్చాడు మా దగ్గరకు. "అమ్మా, నాకు అన్నివిధాలా నచ్చిన అమ్మాయిలు ఇద్దరు కనిపించారు. ఒక అమ్మాయి అయితే నీకు నచ్చుదనుకో. అయినాసరే, ఎలాగోలాగా నాకు పెళ్ళి అయితే చాలు. ఇదే ఆఖరి ఆక్షన్. నేను ఇక ఆక్షన్ హాల్స్ చుట్టూ తిరగలేను" అన్నాడు. "పిచ్చికన్నా, బాధపడకు. ఇవాళ వేలంపాటలో నీకు కావాల్సిన, నీకు నచ్చిన అమ్మాయిని ఎన్నుకో. డిపాజిట్ కట్టేసి ఎలాగైనాసరే ఇవాళ మనం ఒక అమ్మాయిని గెలిచే వెళ్ళాలి" అన్నాను.

ఇంతకీ మా అబ్బాయికి నచ్చిన అమ్మాయిల వివరాలు... మొదటి అమ్మాయి నం. 9: అనిత. ఎత్తు ఐదడుగుల ఆరంగుళాలు. సన్నగా రివటలా ఉంది. ట్రిబుల్ బీటెక్ చదివింది. ముప్ఫైవేలు సంపాదిస్తోంది. ఈ అమ్మాయి వెల ఇరవైలక్షలు. అమ్మాయి సంపాదన గురించి భర్త ఆరాలు తియ్యకూడదట. ఆమెను జీవితాంతం భర్తే పోషించాలట. ఆమెకి తమ్ముడు ఉన్నాడు. తమ్ముడి పెళ్ళి విషయంలో కాబోయే భర్త పాలుపంచుకోవాలి.

రెండో అమ్మాయి నం. 27: సుజిత. ఎత్తు ఐదడుగుల పది అంగుళాలు. బొద్దుగా అందంగా ఉంది. కంప్యూటర్ ఇంజినీరింగ్ చదివింది. ఏభైవేలు జీతం. మిగతా నిబంధనలన్నీ మామూలే. అయితే ఆమెకు తమ్ముడు లేడుగానీ ఒక చెల్లి ఉంది. తన చెల్లికి మంచి రేటు వచ్చేట్లు కాబోయే భర్త ప్రయత్నిస్తే అందులో ఇరవైశాతం బహుమతిగా ఇస్తారు.

నేనూ మావారూ పై వివరాలు చదివి, మధ్యతరగతి మానవుడు మాల్‌లో అమ్మే అతి ఖరీదైన వస్తువులను సొంతం చేసుకోవాలన్న ఆశతో, కొనలేని అసమర్థతతో వాటివైపే చూస్తున్నట్లుగా చూస్తున్నాం. మా చిట్టికన్నా జగన్, మా దగ్గరకు వచ్చి ఇద్దరిమధ్యనా నిలబడి, మా భుజాలపై ఆప్యాయంగా చేతులువేసి, "బి బ్రేవ్ అండ్ బి ఆప్టిమిస్టిక్. నాకు ఎందుకో ఇవాళ సుజితను సొంతం చేసేసుకుంటానని చాలా నమ్మకంగా ఉందమ్మా. మనం వేలంపాటలో ఆమెను గెలుస్తాం" అంటున్నాడు. వాడిని చూస్తుంటే

నాకు కడుపు తరుక్కుపోతూంది. మేము వేలం పాడాలనుకున్న ఇద్దరు అమ్మాయిల విలువలో పదిశాతం అంటే ఐదు లక్షలు డిపాజిట్ కట్టి, మెడికల్ రిపోర్టులు వెరిఫై చేయించుకుని, వాటికి సంబంధించిన రశీదులు తీసుకుని హాల్లో డయాస్‌కి ఎదురుగా మూడో వరుసలో కూర్చున్నాం.

డయాస్‌మీద పెద్దపెద్ద అక్షరాలతో రెండు వాక్యాలు రాసి ఉన్నాయి.

**ఆనాడు ఆడపిల్ల అని కడుపులోనే తుంచేశారు.**

**ఈనాడు అగ్గిపుల్ల అయి మిమ్మల్ని మసి చేస్తూంది. శభాష్ వనితా!**

నాకు కడుపులో ఫోర్క్‌తో గుచ్చి, కసికసిగా మెలితిప్పినంత బాధగా ఉంది.

అమ్మాయిలను తమ కొడుకుల కోసం వేలంపాడే తల్లిదండ్రులు డిపాజిట్ కట్టడాలు వగైరా లాంఛనాలన్నీ పూర్తి అయిపోయినట్టున్నాయి. పన్నెండు గంటలకు ఇంకా పదినిమిషాలు ఉందనగా, హాలు బయట గేట్లు తాళాలు వేసేశారు. చాలామంది బయట మిగిలిపోయారు. ఆరోజు వేలంపాటలో లభించే అమ్మాయిలు ఏభైమంది అని ప్రకటించారు నిర్వాహకులు.

హాలునిండా ఒక్కో బల్లముందు తల్లీ తండ్రీ వారిమధ్యలో అబ్బాయీ, వాళ్ళముందు అమ్మాయిని ఏవైనా ప్రశ్నలు అడగదలుచుకుంటే మైక్ మౌత్‌పీస్, తమ పాట మొత్తం తెలియచెయ్యడానికి ఎలక్ట్రానిక్ బటన్... ఇదీ సీను. ప్రతీవారి ముఖంలోనూ ఉత్కంఠ, ఆశనిరాశలు, అసలు వేలంపాట ఎలా ఉంటుందో, ఇంతకుముందు వచ్చినవారిని ఆసక్తిగా వివరాలు అడుగుతున్నారు మొదటి సారి పాటకు వచ్చినవారు.

సమయం పన్నెండు అయింది. ముఖమల్ తెర పక్కకు తొలగింది చాలా నెమ్మదిగా... హాల్లో ఉన్నవారి హృదయాలను చల్లబరుస్తూ, గుండెదడ వేగాన్ని పెంచుతూ. సుమారు ఆరు అడుగుల పొడవు, రెండు అడుగుల కైవారంతో బంగారం గొలుసులు ఉన్న రిమ్‌లెస్ గోల్డ్‌ఫ్రేమ్ కళ్ళజోడు, పీపామీద పీపా బోర్లించినట్లుగా భారీ శరీరం ఉన్న ఒక ఏభై సంవత్సరాలు పైబడిన మహిళ వేదికపైకి వచ్చింది. ఆమె కట్టుకున్న చీర, అలంకరించుకున్న నగల ఖరీదు కట్టాలంటే అంత తేలిగ్గా అయ్యేపని కాదు. ఆమె గొంతు సవరించుకుని –

"అందరికీ నమస్కారం,

ముఖ్యంగా అబ్బాయిల తల్లిదండ్రులకు నా హృదయపూర్వక సానుభూతి తెలియచేస్తున్నాను. నేను పదహారు సంవత్సరాల వయసులో ఉండగా, గర్భవతులను ఎవరిని కదిలించినా దాదాపు అందరూ అబ్బాయి కావాలనే చెప్పేవారు. ఎవరూ కూడా అమ్మాయి కావాలనేవారు కాదు. అప్పటికే ఒక అబ్బాయి ఉన్నవారూ లేదా బాగా

సిరిసంపదలు ఉన్నవారూ మాత్రం 'ముద్దూముచ్చటా తీరాలంటే అమ్మాయి ఉండాలి' అనేవారు. చాలామంది కడుపులో ఉన్నది ఏ బిడ్డో రహస్యంగానైనా తెలుసుకుని అమ్మాయైతే అబార్షన్ చేయించుకునేవారు కూడా. మన దేశంలోనే ఒక రాష్ట్రంలో అయితే అమ్మాయి పుడితే చంపేసే దురాచారం ఉందంటే, అమ్మాయి అంటే అప్పట్లో ఎంత చిన్నచూపు ఉండేదో అవగతమవుతూంది.

మామిడిటెంక నాటేటప్పుడు అందరూ ఆ టెంక నాటేవారిని ఎగతాళి చేస్తారు. నువ్వేమైనా మామిడిపళ్ళు తింటావా అని. కానీ, ఆ టెంక కాలక్రమేణా మహావృక్షమై జనానికి మధురమైన మామిడిపళ్ళు అందిస్తుంది. ఆ మామిడిటెంక నాటిన మహానుభావులలాగా ఆనాడు కడుపులో ఉన్న ఆడపిల్లను కిరాతకంగా చంపేయకుండా కాపాడిన దయామయుల అమ్మాయిలు కొంతమంది మాత్రమే ఇప్పుడు మిగిలారు. విచిత్రమైన పరిస్థితి ఏమిటంటే, ప్రస్తుతం పదిమంది అబ్బాయిలకు ఒక అమ్మాయే ఉంది పెళ్ళిచేసుకోవడానికి.

నాకు ఆడపిల్లలంటే ఇష్టంలేని తల్లిదండ్రులంటే చాలా కోపం. అందుకే నేనీ ఆక్షన్ సంస్థ ప్రారంభించాను. తప్పదు, ఆడపిల్లలను వద్దనుకున్నవారందరూ శిక్ష అనుభవించాల్సిందే. ఈరోజు ఏభైమంది అమ్మాయిలు ఆక్షన్‌లో పాల్గొంటున్నారు. అమ్మాయిల ఆక్షన్ విలువ వందకోట్లు. మీరు కట్టే డిపాజిట్ విలువ పదికోట్లు. పాడినా పాడకపోయినా మాకు దక్కే మొత్తం రెండుకోట్లు. చూశారా, ఆడపిల్ల అగ్గిపుల్ల ఎలా అయిందో.

ఆక్షన్ పాల్గొనే అమ్మాయి వచ్చి ఇక్కడ ఈ సింహాసనంలో కూర్చుంటుంది. మేము దేవునిపాట లక్ష రూపాయలతో మొదలుపెడతాము. మీ బల్లలపై అమర్చిన ఎలాక్ట్రానిక్ మీటర్స్‌పై మీరు అనుకుంటున్న మొత్తానికి ముందు లేచినిలబడి తరవాత బటన్ నొక్కాలి. ఆ అమ్మాయికి నిర్దేశించిన వెలకన్నా ఎక్కువ కూడా ఎన్నుకోవచ్చును. మేము రెడ్‌లైట్ వెలిగించి అమ్మాయిని లోపలికి పంపించివేస్తే పాట పూర్తి అయిపోయినట్లే. గుడ్‌లక్" అని చెప్పి ఆమె వెళ్ళిపోయింది.

వేలంపాట మొదలైంది. అమ్మాయిలు వస్తున్నారు, వెళ్తున్నారు. అంతవరకు ఎనిమిదిమంది వారికి నిర్ణయించిన రేటుకన్నా ఎక్కువకే వెళ్ళిపోయారు. నంబరు తొమ్మిది అనిత అని ప్రకటించారు. మేము అలర్ట్ అయ్యాం. మా జగన్ ఆ అమ్మాయిని నఖశిఖ పర్యంతం చూస్తున్నాడు. సన్నగా రివటలా ఉన్నాసరే, ఏదో తెలియని ఆకర్షణశక్తి ఆమెలో, ముఖ్యంగా కళ్ళల్లో ఉంది. నవ్వుతూంటే సమ్మోహనంగా ఉందా అమ్మాయి.

ఆక్షన్ బెల్ మోగగానే మేము లేచినిలబడి పదిలక్షలు బటన్ నొక్కాం. మరొకరు లేచి పదిహేను లక్షలు నొక్కారు. వెంటనే మేము పద్దెనిమిది లక్షలు నొక్కాం. వెంటనే పదిహేను లక్షలు నొక్కినవాళ్ళు పాతికలక్షలు నొక్కేశారు. మేము ఆలోచించుకోడానికి రెండు నిమిషాలు ఆగాం. అంతే, రెడ్‌లైటు వెలిగింది. అమ్మాయి వెళ్ళిపోయింది. "అమ్మా..." అంటూ తలపట్టుకున్నాడు జగన్. వాడి బాధ చూడలేకపోతున్నాను నేను. కానీ ఏం చేయగలను?

ఒక గంట తరవాత నంబర్ ఇరవైఏడు సుజిత అని ప్రకటించారు. ఈ అమ్మాయి సినీతార శ్రీదేవికన్నా అందంగా ఉంది. పొడుగుకుతగ్గ అవయవ సౌష్టవంతో పాలరాతి బొమ్మలా ఉంది. నవ్వితే విశ్వమోహినిలా ఉంది. ఆ అమ్మాయి చిరునవ్వు విసిరి 'ఇలా రా' అని సైగ చేసిందంటే ఆ యువకుడు ఆమెకు దాసోహం అనాల్సిందే. మా జగన్ ఆమెను ఎలాగైనా వశం చేసుకోవాలని నాకు చెప్పాడు. అందుకని ఆమెను ఏభైలక్షలకైనా పాడటానికి రెడీ అయిపోయాం. అమ్మాయి వెనకాల దేమునిపాట లక్ష వెలిగింది. మేము నిలబడి పదిలక్షలు నొక్కాం. ఆ వెంటనే ఇంకొకరు ఇరవైలక్షలు నొక్కారు. మేము ముప్పైఅయిదు లక్షలు, మరెవరో నలభై లక్షలు, ఇలాకాదని మేము ఏకంగా ఎభై లక్షలు నొక్కగా మా అబ్బాయి బల్ల ఎక్కి డాన్స్ చేయసాగాడు.

ఇంతలో జరిగింది దుస్సంఘటన – వెనకనుండి ఎవరో డెభై అయిదు లక్షలు నొక్కారు. అంతే, గంట మోగడం, ఆ అమ్మాయి వెళ్ళిపోవడం, నాట్యం చేస్తున్న మా అబ్బాయి బల్లమీద నుండి చెట్టులా కూలిపోవడం ఒకేసారి జరిగిపోయాయి. నేను కుప్పకూలిపోయిన మా అబ్బాయి దగ్గరకువెళ్ళి "బాబూ జగన్ లేరా – నీకు పెళ్ళి కాకపోయినా ఫర్వాలేదురా, లేరా నా చిట్టితండ్రీ" అంటూ హృదయవిదారకంగా రోదిస్తున్నాను. నా ఏడుపులు హాలులో రీసౌండ్ వస్తున్నాయి.

"ఏమయిందే,' అలా ఏడుస్తున్నావ్" అంటూ శ్రీవారు తట్టిలేపడంతో కళ్ళు తెరిచాను. 'అమ్మో, ఇదంతా కలా? ఎంత భయంకరంగా ఉంది'. నా గుండెలు ఇంకా దడదడలాడుతూనే ఉన్నాయి. "పీడకల అండీ బాబూ. మనం బాబు తరవాత అమ్మాయి పుడుతుందని పిల్లలు వద్దనుకున్నామా... అలా వద్దండీ. మనం మళ్ళీ పిల్లలకోసం ప్రయత్నంచేద్దాం. నాకు మాత్రం ఈసారి అమ్మాయే కావాలి. సరేనా" అంటున్న నన్ను ఆయన చిత్రంగా చూస్తూ–

"పిచ్చిమొద్దూ, ఏమయింది నీకు" అంటున్నారు. ఆయన రెండుచేతులూ నా గుండెలపై పెట్టుకుని "అది అంతే. మరి వివరాలు అడక్కండి" అన్నాను, మరోచేయి పక్కనే నిద్రపోతున్న బాబుమీదవేసి. ●

(ఈనాడు, ఆదివారం – 07.03.2010)